
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 కర్నూలు జిల్లా వార్తలు

గురువారం 21 మార్చి 2024



రంజాన్ వేళలు

	ఇఫ్తార్(గురువారం)	సహెరి(శుక్రవారం)
కర్నూలు	6:34 (సాయంత్రం)	4:59 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:31 (సాయంత్రం)	5:11 (ఉదయం)
ఆదోని	6:36 (సాయంత్రం)	5:00 (ఉదయం)



గెలిపించేది వీళ్లే...!

- 69 శాతం 30-60 ఏళ్లు మధ్య ఓటర్లే
- జిల్లాలో కీలకం వారే
- 2019 ఎన్నికల తరువాత పెరిగిన ఓటర్లు 2.07 లక్షలు
- తొలిసారి ఓటు వేయనున్న నవ ఓటర్లు 49,103
- ఓటర్లను ఆకట్టుకునే యత్నాలు షురూ


నాడు-నేడు ఓటర్లు, పెరిగిన ఓటర్లు

నియోజకవర్గం	2019	2024	పెరిగిన ఓటర్లు
కర్నూలు	2,58,815	2,72,086	13,271
కోడుమూరు(ఎస్సీ)	2,16,090	2,43,825	27,735
ఎమ్మిగనూరు	2,27,253	2,44,818	17,565
మంత్రాలయం	1,87,011	2,06,506	19,495
ఆదోని	2,04,109	2,59,896	55,787
ఆలూరు	2,35,064	2,56.538	21,479
పత్తికొండ	2,06,538	2,21,133	14,595
కర్నూలు పార్లమెంట్	**15.34.880**	**17,04,802**	**1,69,922**
పాణ్యం	2,85,031	3,25,575	37,544
జిల్లా మొత్తం	**18,22,911**	**20,30,377**	**2,07,466**

వివిధ వయసుల ఓటర్లు సుమారుగా..

వయసు	ఓటర్లు (లక్షల్లో)
18-19	0.50
20-29	2.75
39-30	6.25
40-49	5.15
50-59	2.75
60-69	1.80
70-79	0.85
80 ఏళ్ల పైబడిన	0.25
మొత్తం	**20.30**





కర్నూలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక సంగ్రామ శంఖం మోగింది. ఎన్నికలకు దాదాపు రెండు నెలలు సమయం ఉంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు అస్త్రశస్త్రాలకు పదును పెడుతున్నారు. 2019 ఎన్నికల నాటి ఓటర్లతో పోలిస్తే జిల్లాలో 2.07 లక్షల ఓటర్లు పెరిగారు. కొత్తగా ఓటు వేసే నవ ఓటర్లు 49,103 మంది ఉన్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు, వారి అనుచరులు ఓటర్ల జాబితాను ముందు పెట్టుకొని ఏ వయసు ఓటర్లు ఎంత మంది ఉన్నారు..? సామాజికవర్గాల వారీగా ఏ వర్గం ఓటర్లు బలంగా ఉన్నారు..? అంటూ లెక్కలు వేస్తున్నారు. జిల్లాలో 30-60 ఏళ్ల మధ్య వయసున్న వారు అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్లలో దాదాపు 69 శాతం వారే ఉన్నారు. పోలింగ్‌లో పాల్గొనే ఓటర్లలో ఈ వయసు వారే అధికంగా ఉంటారని పోలింగ్ విధుల్లో అనుభవం ఉన్న అధికారులు పేర్కొంటున్నారు. అంటే.. రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం నిర్ణయించడంలో వారే కీలకంగా మారనున్నారు.

జిల్లాలో కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు సహా పాణ్యం నియోజకవర్గం ఉంది. ఆలూరు, ఆదోని మినహా టీడీపీ-జనసేన-బీజేపీ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ప్రకటించింది. అధికార వైసీపీ ఎంపీ సహా ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటిచింది. ప్రధాన పార్టీ అభ్యర్థులు గెలుపించే ఓటర్లు ఎవరనే కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనేది ఓ అంశమైతే.. గెలిపించేది ఎవరనేది కూడా ఆసక్తిగా మారింది. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 20.30 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారులు నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారిగా ఎంత మంది ఓటర్లు ఉన్నారు..? వారిలో పురుషులు, మహిళలు, థర్డ్ జెండర్ ఓటర్లు ఎంత మంది ఉన్నారు? అనే జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేసింది. ఈ జాబితాను ముందు పెట్టుకొని వయసుల వారిగా, సామాజికవర్గాల వారిగా అభ్యర్థులు అంచనాలు వేస్తూ తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.



పెరిగిన ఓటర్లు 2.07 లక్షలు!:

కర్నూలు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 15.35 లక్షల ఓటర్లు, పాణ్యం నియోజకవర్గంలో 2.88 లక్షల ఓటర్లు కలిపి జిల్లాలో 8 నియోజకవర్గాల్లో 2019 మార్చి 25వ తేది నాటికి 18.23 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. ఆ రోజు వరకు జిల్లాలో 20.30 లక్షల ఓటర్లు ఉన్నారు. అంటే.. 2019 ఎన్నికల తరువాత కర్నూలు పార్లమెంట్ పరిధిలో 1.70 లక్షలు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 37 వేలు కలిపి జిల్లాలో 2.07 లక్షల ఓటర్లు పెరిగారు. ప్రధానంగా అత్యధికంగా ఆదోనిలో 55,787 ఓటర్లు పెరిగితే.. అత్యల్పంగా కర్నూలు నియోజకవర్గంలో 13,271 మంది ఓటర్లు పెరిగారు.

నవ ఓటర్లు 49,103 మంది:

కొత్తగా నమోదు చేసుకున్న 18-19 ఏళ్ల నవ ఓటర్లు 49,103 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 28,228 మంది ఉంటే.. మహిళలు 20,867 మంది ఉన్నారు. వీరు వేసే తొలి ఓటు జీవితంలో గుర్తుండిపోతుంది. అలాగే.. 85 ఏళ్లు పైబడిన వృద్ధ ఓటర్లు 10,005 మంది ఉన్నారు. వీరిలో మహిళలే 6,373 మంది ఉంటే పురుషులు 3,632 మంది ఉన్నారు. వృద్ధ ఓటర్లలో ముప్పాతిక శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోలేని స్థితిలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలుస్తుంది.



ఓటర్లను ఆకట్టుకునే ఎత్తులు!

మే 13న ప్రతి ఓటరును పోలింగ్ కేంద్రానికి రప్పించి తమకు అనుకూలంగా ఓటు వేయించుకోడానికి ఎత్తులు వేస్తున్నారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవడానికి ప్రధాన పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు సంక్షేమ పథకాలు పేరిట తాయిలాలు ప్రకటిస్తున్నాయి. ముఖ్యంగా అధికార వైసీపీ నవరత్నాలను నమ్ముకుంటే.. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ-జనసేన-బీజేపీ ఎన్డీఏ కూటమి సూపర్ సిక్స్ పథకాలను గెలిపించే వరాలుగా మార్చుకుంది. బీసీ గర్జన సభలో 50 ఏళ్లకు పైబడిన బీసీలకు పింఛన్ ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ప్రస్తుతం 60 ఏళ్ల దాటిన వారికి పింఛను ఇస్తున్నారు. టీడీపీ ప్రకటించిన మేరకు బీసీలకు 50-60 ఏళ్ల మధ్య వయసు వారు కూడా పింఛన్‌కు అర్హులు అవుతారు. ఆ వయసు ఓటర్లు దాదాపు 2.75 లక్షల నుంచి 3 లక్షల మంది దాకా ఉన్నారు. టీడీపీ ప్రత్యేకంగా వారిపై ఫోకస్ పెట్టింది. అదే క్రమంలో డిగ్రీ, పీజీ చేసిన నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ ఇవ్వకపోవడం ప్రభుత్వంపై కోపంగా ఉన్నారు. అంటే.. 20-40 ఏళ్ల మధ్య వయసు కలిగిన యువ ఓటర్లు దాదాపు 9 లక్షల మంది ఉన్నారని అంచనా. టీడీపీ ప్రధానంగా వారిపై దృష్టి సారించింది. మహాశక్తి పథకం కింద తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, దీపం కింద మూడు సిలిండర్లు ఉచితం, ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ప్రకటించింది. మహిళా ఓటర్లు 10.28 లక్షల మంది ఉన్నారు. వారిని ఆకట్టుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేవారిలో 30-60 ఏళ్ల మధ్యవారే అధికంగా ఉంటారని ఎన్నికల విధుల్లో అనుభవం కలిగిన అధికారులు అంటున్నారు. ఆ వయసు ఓటర్లు దాదాపు 14 లక్షల మందికి పైగా ఉన్నారు. అభ్యర్థుల గెలుపోటముల్లో వారే కీలకంగా మారనున్నారు. ఆ ఓటర్లపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్నారు.



మిర్చి ధర పతనం

- గత నెలలో రూ.30 వేలకు పైగా పెరిగిన ధర
- ఇప్పుడు సగానికి పడిపోయిందని రైతుల ఆవేదన



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 20: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిర్చి పంట రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. గత సంవత్సరం రూ.40 వేలకు పైగానే ధర పలికింది. ఈ సంవత్సరం ప్రారంభంలో రూ.30 వేలకు పైగానే ధర పలికింది. అధిక డిమాండ్, ధర ఉండే బ్యాడిగి, డబ్బిరం రకం మిర్చిని ఈసారి రైతులు బోర్లు, బావులు, కేసీ కెనాల్, ఎల్లెల్సీతో పాటు హంద్రీనీవా కాలువ, గాజులదిన్నె జలాశయం ఆయకట్టు ప్రాంతంలో దాదాపు 60వేల ఎకరాల్లో సాగు చేశారు. అయినా నీరు చాలక ట్యాంకర్ల ద్వారా నీరు అందించి పంటను కాపాడుకున్నారు. ఈసారి వర్షాభావం వల్ల పంట సాగు విస్తీర్ణం తగ్గిందని, ధర పెరుగుతుందని రైతులు అంచనా వేశారు. అయితే తెగుళ్ల కారణంగా దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దాకా దిగుబడి రావాల్సి ఉండగా.. ఐదారు క్వింటాళ్లకే పరిమితమైంది. చేతికందిన పంటకైనా గిట్టుబాటు ధర అందుతుందేమోనని రైతులు ఆశ పెట్టుకున్నారు. అయితే ఈ నెల ప్రారంభం నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో ఎండుమిర్చి ధర నానాటికి తగ్గిపోతూ వస్తోంది. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం ఎండు మిర్చి ధర రూ.17వేలకు తగ్గిపోయింది. మిర్చి వ్యాపారులు సిండికేటై తమను ముంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని మొర పెట్టుకుంటున్నారు.

ఆదోని (అగ్రికల్చర్) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో 3081 బస్తాల ఎండు మిర్చి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,119, గరిష్ఠ ధర రూ.14,018 పలికింది. 2047 రకం మిర్చి కనిష్ఠ ధర రూ.4,569, గరిష్ఠ ధర రూ.11,141, సిన్నెంట రకం కనిష్ఠ ధర రూ.4,800, గరిష్ఠ ధర రూ.9,009, 2043 రకం మిర్చి కనిష్ఠ ధర రూ.4,116, గరిష్ఠ ధర రూ12,509 పలికింది. గత 15 రోజుల ధరలతో పోలిస్తే క్వింటానికి రూ.6 వేలకు పైగా తగ్గింది. మిర్చి ధరల పతనంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

మోహన నారసింహుడు

- మోహినీ అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీవారు
- అహోబిలంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నంద్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనృసింహస్వామి మోహినీ అలంకరణలో భక్తులను కనువిందు చేశారు. మైమరపించే సోయగాలు, వివిధ రకాల స్వర్ణాభరణాలు, సుగంధ పుష్పాలతో మోహనరూపుడైన శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అహోబిలం లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో ఆరో రోజు బుధవారం జ్వాలా నరసింహస్వామిని వేదపండితులు మోహినీ రూపంలో అలంకరించారు. ముందుగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి ఉత్సవం, అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి శరభ వాహనంపై విహరించారు. అదేవిధంగా దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి ఉదయం శేషవాహనంపై దర్శనమివ్వగా రాత్రి చంద్రప్రభ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామ్‌కో సిమెంటు కంపెనీ యాజమాన్యం తరఫున రూ.6 లక్షలు విలువ చేసే గేట్లను ఓఎస్డీ శివప్రసాదరావు, పీఆర్వో సేతురామన్ బుధవారం అందజేశారు.



మోహినీ అలంకారంలో జ్వాలా నరసింహస్వామి

పీటలపై ఆగిన పెళ్లి

- వేరే మహిళతో వరుడి సహజీవనం
- డయల్ -100కు బాధితురాలి ఫిర్యాదు



వెల్దుర్తి, మార్చి 20: బంధువులు, స్నేహితులతో పెళ్లి సందడి నెలకొంది. చిన్నారుల కేరింతలు, పెద్దల పలకరింపులు... పచ్చని పందిట్లో మరో 20 నిమిషాల్లో వివాహం జరిగేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఉన్నట్టుండి పీటల దాకా వచ్చిన ఆ పెళ్లి ఆగిపోయింది. ముహూర్తం సమయానికి పెళ్లికుమార్తె తల్లిదండ్రులకు పిడుగులాంటి సమాచారం తెలియడంతో గందరగోళ పరిస్థితి తలెత్తింది. పెళ్లికుమారుడు ఇప్పటికే ఓ మహిళతో సహజీవనం చేస్తూ ఉండటం, సంతానం కూడా ఉందన్న సమాచారం రావడంతో పెళ్లి ఆగిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన యువకుడికి కర్నూలు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. వెల్దుర్తి పట్టణ సమీపంలోని బ్రహ్మగుండ క్షేత్రంలో బుధవారం ఉదయం 9 గంటలకు వివాహం జరగాల్సి ఉంది. అయితే పెళ్లి కుమారుడికి గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలపల్లికి చెందిన ఓ వివాహితతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా సహజీవనానికి దారితీసింది. విశాఖపట్నంలో వీరిద్దరూ మహిళ కుమార్తె కలసి ఉండేవారు. ఈ విషయాలన్నీ దాచిపెట్టిన సదరు వ్యక్తి పెద్దపాడుకు చెందిన యువతితో వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. సరిగ్గా పెళ్లి ముహూర్తానికి 20 నిమిషాల ముందు విషయం తెలుసుకున్న సహజీవనం చేస్తున్న మహిళ డయల్-100 ద్వారా పోలీసులకు, పెళ్ళికూతురు తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా ఆధారాలతో సమాచారం చేరవేసింది. దీంతో పెళ్లికూతురు బంధువులు వరుడితో, పాటు అతడి తల్లిదండ్రులతో ఘర్షణకు దిగారు. మోసగాడితో పెళ్లి వద్దంటూ పెళ్లికుమార్తె సహా బంధువులందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా పెళ్లి కుమారుడు తాను నేవీలో పనిచేస్తున్నానని, చౌకగా బంగారు బిస్కెట్లు ఇస్తానంటూ గ్రామంలో రూ.12 లక్షలు మేర మోసం చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించండి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), మార్చి 20: ఎన్‌జీఎస్‌పీ, 1950, జిల్లాలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్లతో పాటు సీ-విజిల్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఎన్నికల అంశాలపై ఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ప్రదేశాల్లో హోర్డింగ్‌లు ఉన్నప్పటికీ అందులో ఎటువంటి రాజకీయ ప్రకటనలను అనుమతించకూడదని తెలిపారు. సీ-విజిల్ పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదులను కేవలం 75 శాతమే పరిష్కరించామని, అలా కాకుండా వందశాతం నమోదు కావాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి శిక్షణ తరగతులు మార్చి నెలలోపు, నియోజకవర్గ శిక్షణ తరగతులు ఏప్రిల్ పదోతేదీలపు పూర్తి అవుతాయన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు శేషిరెడ్డి, రామలక్ష్మి, జడ్పీ సీఈఓ నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఇవే..

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 20: కర్నూలు పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎంపిక చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల అనంతరం కౌంటింగ్ ప్రక్రియ రాయలసీమ యూనివర్సిటీలో జరగనుంది. ఈవీఎం యంత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

సంఖ్య	నియోజకవర్గం	ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం	కౌంటింగ్ జరిగే ప్రదేశం
138	పాణ్యం	జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ నంద్యాల రోడ్డు, కర్నూలు	ఇంజనీరింగ్ బ్లాక్, 2వ ఫ్లోర్, రాయలసీమ యూనివర్సిటీ
137	కర్నూలు	డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ, అవుట్‌డోర్ స్టేడియం, క్లబ్ రోడ్డు, కర్నూలు	లైఫ్ సైన్స్ బ్లాక్, 3వ ఫ్లోర్ రాయలసీమ యూనివర్సిటీ
142	పత్తికొండ	పత్తికొండ జూనియర్ కాలేజీ, పత్తికొండ	లైఫ్ సైన్స్ బ్లాక్, 3వ ఫ్లోర్ రాయలసీమ యూనివర్సిటీ
143	కోడుమూరు	సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రాంగణం. కర్నూలు	ఇంజనీరింగ్ బ్లాక్, 3వ ఫ్లోర్ రాయలసీమ యూనివర్సిటీ
144	ఎమ్మిగనూరు	ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఎమ్మిగనూరు టౌన్.	ఇంజనీరింగ్ బ్లాక్, 4వ ఫ్లోర్ రాయలసీమ యూనివర్సిటీ
145	మంత్రాలయం	పరిమళ విద్యానికేతన్ పాఠశాల, మంత్రాలయం	లైబ్రరీ బ్లాక్, 1వ ఫ్లోర్ రాయలసీమ యూనివర్సిటీ
146	ఆదోని	ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఆదోని	లైఫ్ సైన్స్ బ్లాక్, 4వ ఫ్లోర్ రాయలసీమ యూనివర్సిటీ
147	ఆలూరు	ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆలూరు.	ఇంజనీరింగ్ బ్లాక్, 1వ ఫ్లోర్ రాయలసీమ యూనివర్సిటీ

వైసీపీ ప్రభుత్వానికి రైతులపట్ల బాధ్యత లేదని పదే పదే రుజువవుతోంది. రైతుల కోసమే తమ ప్రభుత్వం ఉన్నదని బైటికి తీయని మాటలు చెబుతూ వంచిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2023 ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లాలోని 54 మండలాల్లో కరువు వల్ల రైతులు భారీగా నష్టపోయారు. అందరినీ ఆదుకోవాల్సిన ప్రభుత్వం కేవలం 30 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చింది. దీని కోసం అన్యాయమైన నిబంధనలు తీసుకొచ్చింది. సుమారు నాలుగు లక్షల మంది రైతులు కరువు వల్ల నష్టపోతే నిబంధనల సాకుతో కేవలం 3.75 లక్షల మందికి బిచ్చంలా పరిహారం విదిల్చి చేతులు దులుపుకుంది. మరో 3 లక్షల మందికిపైగా రైతులను అనర్హుల జాబితాలో చేర్చింది. నష్టపోయిన రైతులు పరిహారానికి అనర్హులు కావడం ఏమిటనే విమర్శలను ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023-24 రబీ సీజన్‌లో కూడా అన్ని మండలాల్లో కరువు వల్ల పంటలు దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వానికి రైతుల గోడు పట్టలేదు. కేవలం 31 మండలాల్లోనే కరువు ఉందని తీర్మానించింది. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సమయంలో వైఎస్ జగన్ 2018 ఖరీఫ్, 2018-19 రబీ పంట నష్టానికి పరిహారం ఇస్తానని హామీ ఇచ్చారు. అది కూడా అతీగతి లేదు.



సాయమా? బిచ్చమా?

కర్నూలు అగ్రికల్చర్



- నిబంధనల సాకుతో సగానికిపైగా రైతులకు అందని పంట నష్ట పరిహారం
- 2018 ఖరీఫ్, 2018-19 రబీ పంట నష్టానికి ఇప్పటికీ అందని సాయం
- కేంద్రం పంపిన నిధులను దారి మళ్లించిన జగన్ ప్రభుత్వం
- 2023 ఖరీఫ్, 2023-24 రబీలో కరువు మండలాల ప్రకటనలో అన్యాయం
- నిబంధనల పేరుతో భారీగా అనర్హుల జాబితాలోకి

ప్రజలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడంలో వైసీపీ ప్రభుత్వానికి సాటి లేదు. కరువుబారిన పడిన రైతులందరినీ ఆదుకుంటానని ప్రగల్భాలు పలకడం, వాటిని అమలు చేయకపోవడంలో సీఎం జగన్‌కు ఏపాటి చిత్తశుద్ధి ఉన్నదీ రుజువు అవుతోంది టీడీపీ ఆధికారంలో ఉన్న కాలంలో 2018 ఖరీఫ్‌తో పాటు, 2018-19 రబీలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 6.11 లక్షల మంది రైతులు పంట నష్టపోయారు. నాటి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని మండలాలన్నీ కరువు బారిన పడ్డాయని గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక మేరకు కేంద్ర ప్రభుత్వం 2019లో రూ.500 కోట్ల కరువు సాయాన్ని విడుదల చేసింది. 2019 జగన్ ప్రతిపక్ష నేతగా చేపట్టిన పాదయాత్రలో 2018 ఖరీఫ్, 2018-19 రబీ పంట నష్టపరిహారాన్ని రైతులకు అందిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లు కావస్తున్నా ఆ మాటను నిలబెట్టుకోలేదు. పైగా కేంద్రం విడుదల చేసిన పరిహారాన్ని పక్కదారి పట్టించింది. తన పాలనాకాలంలో కరువుబారిన పడ్డ రైతుల్లో సగానికిపైగా అనర్హులని తేల్చి వారిని కష్టాల్లో తోసేసింది.

● అర్థం పర్థం లేని నిబంధనలు

ప్రభుత్వం అర్థం పర్థం లేని నిబంధనలు అమలు చేయడం వల్ల పంట నష్టానికి గురైన రైతులు అనర్హుల జాబితాలో చేరిపోతున్నారు. 2018 ఖరీఫ్‌లో, 2018-19 రబీ సీజన్‌లో తీవ్ర వర్షాభావం వల్ల పంటలు దెబ్బతిన్నాయి. అయితే రెండు హెక్టార్లకు మాత్రమే నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో దాదాపు రూ.100 కోట్ల పంట నష్టపరిహారానికి అర్హులైన లక్ష మంది రైతులు అనర్హుల జాబితాలో చేరిపోయారు. అదే విధంగా 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు దాదాపు 50 శాతం మంది అనర్హుల జాబితాలో చేరారు. ఉద్యాన పంటలు 50 శాతానికి పైగా నష్టపోతేనే కరువు సాయం అందుతుందనే నిబంధన అమలు చేయడం వల్ల 50 శాతానికి లోబడి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. ప్రభుత్వం తమను కేవలం బిక్షగాళ్లుగా గుర్తిస్తుందని, అరకొర పరిహారం కొందరికి ఇచ్చి చేతులు దులుపుకుంటోందని రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఐదేళ్ల కింద కేంద్రం నిధులు పంపినా.. తమకు పరిహారాన్ని ఇవ్వలేదని విమర్శిస్తున్నారని 2018-19లో పంట నష్టానికి గురైన రైతులు ఆరోపిస్తున్నారు.

కేంద్రం ఇచ్చినా.. దారి మళ్లించిన జగన్

2018 ఖరీఫ్‌లో 40 మండలాలు, 2018-19 రబీ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 33 మండలాల్లో వర్షాభావం వల్ల తీవ్రంగా నష్టపోయిన 6.11 లక్షల మంది రైతులకు రూ.659.40 కోట్ల నష్టపరిహారాన్ని అందించాల్సి ఉందని అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. నాటి టీడీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో తన వంతుగా రూ.500 కోట్ల పరిహారాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లాకు అందజేసింది 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించింది.

2023-24 కరువు పరిహారంలోనూ అన్యాయమే

2023 ఖరీఫ్, 2023-24 రబీ సీజన్‌లలో తీవ్ర వర్షాభావం ఉమ్మడి కర్నూలు జిల్లాను అతలాకుతలం చేసింది. ఖరీఫ్‌లో సాగు చేసిన 6 లక్షల హెక్టార్లు, అదే విధంగా రబీలో సాగు చేసిన 3 లక్షల హెక్టార్లలో పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి, మొక్కజొన్న తదితర పంటలన్నీ వర్షాలు లేక మాడిపోయాయి. తీవ్ర కరువును కళ్లార చూసిన అధికారులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కేవలం 30 మండలాల్లో మాత్రమే కరువు నెలకొన్నట్లుగా నివేదికలు పంపారు. మిగిలిన 24 మండలాల రైతులు తమ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. అయినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, తుగ్గలి, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి మండలాల్లో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉండటంతో ఆ మండలాల రైతులు రోడ్డెక్కి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆ మండలాలను కూడా కరువు జాబితాలో చేర్చాలని రెండు జిల్లాల కలెక్టర్లు పంపిన జాబితాలను ప్రభుత్వం పక్కన పెట్టేసింది. 2023-24 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 6.50 లక్షల మంది రైతులు పంట నష్టానికి గురైతే.. ప్రభుత్వం మాత్రం కేవలం 3.20 లక్షల మంది రైతులకు మాత్రమే కరువు సాయాన్ని అందించింది. నిబంధనల పేరుతో మిగిలిన 3 లక్షల మంది రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం 2024 రబీ సీజన్‌లో కూడా కరువు వల్ల రైతులు నష్టపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 54 మండలాల్లో తీవ్రంగా కరువు పరిస్థితులు వెంటాడినా కేవలం 31 మండలాల్లోనే కరువు నెలకొన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు, గూడూరు, ఆదోని, మంత్రాలయం ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి హొళగుంద, హాలహర్వి, పత్తికొండ తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి, సీ. బెళగల్ మండలాలను కరువు నెలకొన్నట్లుగా రెండు రోజుల క్రితం ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, గోస్పాడు, గడివేముల, బనగానపల్లె, ఉయ్యాలవాడ, సంజామల, అవుకు, నందికొట్కూరు, మిడ్తూరు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, దొర్నిపాడు, నంద్యాల మండలాలో మాత్రమే కరువు ఉందని గుర్తించారు. మిగిలిన ఉమ్మడి జిల్లాలో 23 మండలాల్లో కరువు తాండవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.

రైతులందరికీ నష్టపరిహారం అందిస్తాం

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టానికి గురైన రైతులందరికీ నిబంధనల మేరకు ఇన్‌పుట్ సబ్సిడీ (నష్టపరిహారం) అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపలేదు. గత ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3.75 లక్షల మంది రైతులు పంట నష్టానికి గురైతే.. వారికి రూ.460.47 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని వారి బ్యాంకు ఖాతాలకు ఇటీవలే జమ చేశాం. ప్రస్తుత రబీ సీజన్‌లోనూ వర్షాభావం వల్ల దెబ్బతిన్న పంటలను గుర్తించాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 31 మండలాల్లో కరువు నెలకొన్నట్లు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు అందించిన నివేదికల మేరకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

- వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

ఆటోను ఢీకొన్న కారు.. ఐదుగురికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన ఆటో

ఓర్వకల్లు, మార్చి 20: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయం సమీపాన ఉన్న జగనన్న కాలనీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కర్నూలు నుంచి నంద్యాల వెళ్తున్న ఆటోను వెనుకవైపు నుంచి కారు ఆటోను ఢీకొనడంతో ఆటో 20 అడుగుల లోయలో పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న రాజు, రామప్ప, గంగమ్మ, కేశమ్మ, సామన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రాజారెడ్డి సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సలకలకొండ పొలాల్లో చిరుత మృతి

ఆదోని రూరల్, మార్చి 20 : ఆదోని మండల పరిధిలోని సలకలకొండ పొలాల్లో మృతి చెందిన చిరుతను బుధవారం స్థానికులు గుర్తించారు. ఫారెస్టు అధికారి తేజస్వి, తాలుక ఎస్.ఐ ఎర్రిస్వామి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన చిరుతకు ఎలాంటి గాయాలు లేవని, నోటిలో, ముక్కు ద్వారా రక్తస్రావం జరిగిందని, పోస్టుమార్టం చేస్తేగాని, మృతికి గల కారణాలు చెప్పలేమని ఫారెస్టు అధికారులు తెలిపారు. అయితే గత కొన్ని రోజులుగా బసరకోడ, సలకలకొండ, అలసందగుత్తి పొలాల్లో, కొండల్లో చిరుత సంచరిస్తుందని గ్రామస్థులు, రైతులు అధికారులకు సమాచారం అందించారు. చిరుత దాడిలో పలు మార్లు పశువులు, మేకలు కూడ మృతి చెందాయి. ఎవరైనా విష ప్రయోగం చేయడం వల్లనే చిరుత మృతి చెందిందా? లేక వేటగాళ్ల దాడికి బలైందా? అనేది తెలియాల్సి ఉంది.



మృతి చెందిన చిరుత

మాధవరం స్టీల్ ఫ్యాక్టరీలో ఒకరి మృతి

మంత్రాలయం, మార్చి 20: మంత్రాలయం మండలంలోని మాధవరం స్టీల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న చోడీ గంగ (22) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన వ్యక్తిగా మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఐరన్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న చోడీ గంగపై ఐరన్ ముద్ద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే యాజమాన్యం మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమ్మితం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నలుగురికి గాయాలు

గూడూరు, మార్చి 20: కె నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. కె నాగలాపురం నుండి కర్నూలు వైపు ఇన్నోవా వెహికిల్ వెళ్తుండగా, కర్నూలు నుండి కైరవాడి వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఎదురుగా వచ్చి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న చంద్రమోహన్ రెడ్డి మృతి చెందగా, మరో నలుగురికి గాయాలు అయ్యాయి. ప్రమాద సంఘటన తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన నలుగురిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

పెద్దకడుబూరు, మార్చి 20: రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మేకడోణ గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామానికి చెందిన బోయ బసవరాజు ద్విచక్ర వాహనంపై పెద్దకడబూరు మండలం రంగాపురం గ్రామానికి వెళ్లి తిరిగి పెద్దతుబంళం బయల్దేరాడు. బసలదొడ్డి గ్రామానికి చెందిన వీరేష్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా మేకడోణ గ్రామ సమీపాన రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దతుంబళం గ్రామానికి చెందిన బసవరాజు (32) తలకు బలమైన గాయమైంది. వీరేష్ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దరిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో బసవరాజు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇమాం హుసేన్‌ది రాజకీయ హత్య కాదు..

కాకతాళీయంగా జరిగింది: డీఎస్పీ షర్ఫుద్దిన్

నంద్యాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్‌లోని చాగలమర్రి గ్రామంలో ఈనెల 18వ తేదిన జరిగిన ఇమాం హుసేన్(22) హత్య వెనుక రాజకీయాలు లేవని, కాకతాళీయంగా జరిగినదని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి గ్రామ పంచాయతీకి జరిగిన వేలం పాటల్లో ఇరువర్గాల మధ్య జరిగిన వాగ్వాదం హత్యకు దారితీసిందని చెప్పారు. గత కొన్నేండ్ల నుంచి ఒక వర్గం వారు వేలాలను దక్కించుకుంటున్న తరుణంలో ఈసారి ఇమాంహుసేన్ బంధువులు పాల్గొనటంతో ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు. ఇమాం హుసేన్ తన తండ్రి రసూల్‌కు అండగా నిలబడటంతో అక్కడే ఉన్న అబ్దుల్ ఖాదర్ కుమారుడు దస్తగిరి తన దగ్గర ఉన్న పిడిబాకుతో ఇమాం హుసేన్ గొంతులో పొడిచాడని అన్నారు. చాగలమర్రి ఎస్ఐ రమణయ్య అక్కడికి చేరుకొని ఇమాం హుసేన్‌ను కేరళ వైద్యశాలకు తరలిస్తుండగా ఆయన మరణించాడని డిఎస్పీ వివరించారు. మృతుడి తండ్రి రసూల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామం వద్ద అబ్దుల్ ఖాదర్, దస్తగిరిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పిడి బాకు, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించామన్నారు. నిందితులు, మృతుడి బంధువులు వైసీపీలో కొనసాగుతున్నారని డిఎస్పీ షర్ఫుద్దీన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రైని డిఎస్పీ రాఘవ, ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, చాగలమర్రి ఎస్ఐ రమణయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ షర్ఫుద్దీన్

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం..


- ప్రియురాలు బాలిక మృతి
- ప్రియుడిపై కిడ్నాప్ కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 20: మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామానికి చెందిన ఓ మైనర్(17) అదే గ్రామానికి చెందిన టైలర్‌గా పని చేస్తున్న బెస్త శివ ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరు కావడంతో పెద్దలు వివాహానికి నిరాకరించారు. దీంతో ఈ నెల 18న సోమవారం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై వెళ్లిపోయారు. అదేరోజు వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందును కోసిగి మండల సమీపంలో ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు గమనించి కోసిగి ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ఆదోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి బాలికను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రియుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. శివ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కోలుకుంటున్నాడు. మృతురాలిని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

మూడో రోజు 589 మంది గైర్హాజర్

- ప్రశాంతంగా పది పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 20: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మూడో రోజు బుధవారం కర్నూలు జిల్లా వ్యాప్తంగా 589 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ శామ్యూల్ తెలిపారు. 31,465 మంది విద్యార్థులకు గాను 30,876 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా పరిశీలకుల అధికారి (డీఎల్‌వో) 5 పరీక్ష కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి 3 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 44 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈఓ తెలిపారు.



శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



శ్రీశైలం, మార్చి 20: శ్రీశైలం ముఖద్వారానికి సమీపంలోని ఘాట్‌రోడ్డులో బుధవారం ఓ లారీ (డీసీఎం) అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రకాశం జిల్లా వనకనలమెట్ల మండలం, రేగడిపల్లి గ్రామానికి చెందిన లారీ దాదాపు 50 మందికి పైగా జనంతో శ్రీశైలానికి బయలుదేరింది. శ్రీశైలం ముఖద్వారం సమీపంలోని మలుపువద్ద లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాసేపటి తర్వాత దేవస్థానం బస్సుల ద్వారా భక్తులను శ్రీశైలానికి చేర్చారు.

నందవరం హుండీ ఆదాయం రూ.34.67 లక్షలు

బనగానపల్లె, మార్చి 20: బనగానపల్లె ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. హుండీ ఆదాయంలో రూ.34.67 లక్షలు రాగా, 33 గ్రాముల బంగారు, 3.30 కిలోల వెండి సమకూరినట్లు ఈఓ జి.కామేశ్వరమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సింగిల్‌విండో' ద్వారా ఎన్నికల ప్రచారాలకు అనుమతి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 20: ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సింగిల్ విండో ద్వారా 'ఫస్ట్ ఇన్ - ఫస్ట్ ఔట్' పద్ధతిలో దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులు ఇస్తామని జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంసీసీ అమలును జిల్లా పరిషత్ సీఈవో, హౌసింగ్ పీడీ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పర్యవేక్షణ కోసం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఒక కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సువిధ పోర్టల్ (suvidha.eci.gov.in) వెబ్‌సైట్ ద్వారా నామినేషన్లు, ప్రచారాలు, పోస్టర్లు, రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతులు పొందాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు కోరే ప్రతి అనుమతి ఎన్‌కోర్ (encore.eci.gov.in) వెబ్‌సైట్ ద్వారా నెల రోజుల వ్యవధితో అనుమతులు ఇస్తామన్నారు. సమయం ముగిశాక మళ్లీ నమోదు చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో వాహనాల అనుమతుల కోసం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్వోల కార్యాలయంలో కూడా సింగిల్ విండో పోర్టల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బహిరంగ సభలో ఉపయోగించే లౌడ్‌స్పీకర్ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఉపయోగించకూడదన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.



రాయలసీమ విశ్వవిద్యాలయంలో స్ట్రాంగ్ రూమ్స్ కౌంటింగ్ హాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్, లైఫ్ సైన్స్ బ్లాక్, లైబ్రరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో 8 నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్స్ కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

గుప్తనిధుల వేటగాళ్లు అరెస్టు



పట్టుబడిన గుప్తనిధుల వేటగాళ్లు

ఆత్మకూరు, మార్చి 20: ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలోని నాగలూటి రేంజ్, వెంకటాపురం బీట్ పరిధిలోని నాగలూటి వీరభద్ర స్వామి ఆలయం వద్ద గుప్త నిధుల వేటకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రేంజ్ అధికారి దొరస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడించారు. వెలుగోడు పట్టణానికి చెందిన వెంకయ్య, గోవర్ధన్ ఆచారి అనే వ్యక్తులు నాగలూటి వీరభద్రస్వామి ఆలయం వద్ద గుప్తనిధుల వేటకు పాల్పడినట్లు తమకు సమాచారం వచ్చిందని అన్నారు. వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో డీఆర్ఓ రత్నప్రభ, సిబ్బంది ఉన్నారు. ఇదిలావుంటే ఈ కేసులో మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

ఆ ప్రొఫెసర్లు మళ్లీ విధుల్లోకి...

- కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు, అసోసియేట్లకు అవకాశం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 20: కర్నూలు మెడికల్ కాలేజీలో పదవి విరమణ చేసిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లును మళ్లీ విధుల్లోకి తీసుకోనున్నారు. ఈ మేరకు గవర్నమెంటు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ నెంబర్ 11/2024ను జారీ చేసింది. దీని ప్రకారం రిటైర్డుయిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఒక సంవత్సరం కాంట్రాక్టు ప్రాతిపదికన మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రుల్లో చేరనున్నారు. ఎండీఎంస్ చేసిన వైద్యులు సూపర్ స్పెషాలిటీ వైద్యులకు బోర్డు అవకాశం కల్పించింది. ఈ నెల 16 నుంచి 25వ తేదీలోపు వైద్యులు ప్రిన్సిపాల్‌కు రూ.1000 ఫీజుతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే వారు 69 సంవత్సరాలలోపు ఉండాలి. ఎండీ ఎంఎస్ చేసిన ప్రొఫెసర్‌కు రూ.2లక్షలు, అసోసియేట్‌కు రూ.1.5 లక్షలు, సూపర్ స్పెషాలిస్టుల ప్రొఫెసర్‌కు రూ.2.5 లక్షలు, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.2 లక్షల వేతనం ఉంటుందని నోటిఫికేషన్‌లో పే ర్కొన్నారు. కర్నూలు ప్రభుత్వ బోధనాసుపత్రు ల్లో ప్రొఫెసర్ల పోస్టుల్లో కార్డియాలజీ-1, నెఫ్రాలజీ-1, న్యూరోసర్జరీ-1 సర్జికల్ అంకాలజీ-1, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ-1 ఓబీజీ-2 డీవీఎల్-1, ఫోరెన్సిక్ మెడిసిన్-1, కార్డియాలజీ-1, మెడికల్ అంకాలజీ-1, రేడియాలజీ అంకాలజీ-1, సర్జికల్ అంకాలజీ-1, యురాలజీ-1, రేడియో డయోగ్నస్టిక్-1, పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఏపీఎంఎస్ బోర్డు మెంబర్ సెక్రటరీ వివరాలను ప్రకటించారు. కర్నూలు ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్యుల పోస్టులను భర్తీ చేయడానికి అవసరమున్న చోట ప్రొఫెసర్లను భర్తీ చేయనుంది.

బీటీ నాయుడుని కలిసిన ఎంపీ సంజీవ్‌కుమార్



బీటీ నాయుడితో ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు(అర్బన్), మార్చి 20: కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడును మర్యాదపూర్వకంగా కలి శారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో బీటీ నాయుడును శాలువతో సన్మానించారు. ఇటీవలే చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిన ఎం సంజీవ్ కుమార్ మొదటి సారిగా జిల్లా పార్టీ కార్యాలయానికి తన అనుచరులతో కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రేణుకా ఎల్లమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ బేతం కృష్ణుడు, సీనియర్ నాయకులు కుబేర్ స్వామి, తలాకి కృష్ణ, సునీల్, శాంతి కుమారి, నరసింహ పాల్గొన్నారు.

కర్నూలు అసెంబ్లీ స్థానానికి సీపీఎం పోటీ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 20: కర్నూలు అసెంబ్లీ స్థానానికి సీపీఎం నుంచి పోటీ చేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు కే.జగన్నాథం తెలిపారు. బుధవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల స మావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నిక ల్లో రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం పరస్పర సహకారంతో సర్దుబాటులో ఎన్నికల్లో పోటీచేయాలని నిర్ణయించార న్నారు. కాంగ్రెస్ పార్టీతో చర్చలు జరు గుతున్నాయని తెలిపారు. ఈ సమావేశం లో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్.రాధాక్రిష్ణ, సీపీఐ నగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దానం చేయడం పుణ్యం

కర్నూలు(కల్చరల్), మార్చి 20: రంజాన్ మాసంలో ఉపవాసం పాటించే పేదలకు దానం చేయడం పుణ్యమని ఎంఎస్ బిల్డర్స్ అధినేత కొట్టముళ్ల మహబూబ్ బాషా అన్నారు. బుధవారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోగల ఎంఎస్ బిల్డర్స్ కార్యాలయంలో ఉపవాసం ఉన్న నిరుపేద మహిళలకు నిత్యావసర వస్తువులను ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అధ్యక్షతన ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ అలీమ్ బాషా, భాస్కర్‌రెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 20: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, హిజ్రాలకు ఓటు హక్కును వినియోగిం చుకోవాలని ఆ శాఖ సహాయ సంచా లకురాలు రయిస్ ఫాతిమా సూచించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో ఓటు హ క్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు ఆమె బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు.

వడ్డెగేరి అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

కర్నూలు(హాస్పిటల్), మార్చి 20: నగరంలోని వడ్డెగేరి అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. అక్క డ జరుగుతున్న వ్యాధి నిరోధక కార్యక్ర మాన్ని పరిశీలించారు. ఐదేళ్ల లోపు పిల్ల లందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయిం చాలని తల్లిదండ్రులకు సూచించారు. గర్భిణులకు పలు సూచనలివ్వాలని ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలను ఆదేశించారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన హాస్పిటల్‌కు ఆరోగ్యశ్రీ కేసులను రెఫర్ చేయాలని ఆదేశించారు. ప్రజల్లో ఆరోగ్య, విద్య బోధన గురించి అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోకారమయ్య ఉరుసు

సి.బెళగల్, మార్చి 20: మండలం లోని బురాన్‌దొడ్డి గ్రామంలో గోకా రమయ్య ఉరుసు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కడి యాల కిరణ్‌కుమార్ ఇంటి నుంచి స్వా మివారికి గంధాన్ని తీసుకెళ్లి ఉరుసు ప్రారంభించారు. ఎటువంటి అవాంఛనీ య సంఘట నలు జరుగకుండా ఎస్‌ఐ తిమ్మారెడ్డి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామ పెద్దలు, టీడీపీ నాయకుడు శరత్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

ఇఫ్తార్ విందులో కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 20: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని బిస్మిల్లా ఫంక్షన్ హాలులో టీడీపీ నగర ఆధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తాక్ మౌలానాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మహిళలతో ఏర్పాటు చేసిన ముఖా ముఖీ కార్యక్రమంలో టీజీ భరత్ మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ముస్లింలు ఎంతో లబ్ధి పొందుతారన్నారు. సీఏఏ. ఎస్ఆర్‌సీ ఇలా ఏ బిల్లు వచ్చినా తాను అండా ఉంటానని అన్నారు. మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ముస్తాక్ మౌలానా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో ముస్లింల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. దుల్హన్‌కు కోర్రిలు పెట్టారన్నారు. రంజాన్ తోఫా ఇవ్వడం లేదన్నారు. మళ్లి చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇవన్నీ అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో షేక్ ఖాజా మెయినుద్దీన్, రమీజ్, అజ్మత్, ముస్తాక్, ఖజా, కలాం పాల్గొన్నారు,

టీడీపీ హయాంలోనే ముస్లింలకు రక్షణ: తెలుగుదేశం పార్టీ హయాంలోనే ముస్లింలకు రక్షణ ఉంటుందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో 4వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ముస్లింల కోసం తీసుకొచ్చిన దుల్హన్ పథకానికి ఈ ప్రభు త్వం నిబంధనలు పెట్టి అర్హులకు అందకుండా చేశారన్నారు. ముస్లింలకు రంజాన్ తోఫాను కూడా ఇవ్వడం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ రంగంలో పని చేసే వారందరికి మేలు జరుగుతుందన్నారు. మున్వర్ ఆధ్వర్యంలో అఫ్సర్, మోహబూబ్, షఫి, హనీఫ్, మాలిక్, ఖాజులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఊట్ల రమేష్, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో టీడీపీ అభ్యర్థి పూజలు



పూజలు చేస్తున్న కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి

సి. బెళగల్, మార్చి 20: మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో సయ్యద్ ఖాద్రీ బడెసాబ్ ఉరుసు సందర్భంగా కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి దర్గాలో పూజలు నిర్వహించారు. ఆయనకు గ్రామపెద్దలు రాజు, మద్ది లేటి, మాజీ సర్పంచ్ మునిస్వామి, మాణిక్యం, మాజీ మండల కన్వీనర్ బీఎస్ చిన్న తిమ్మప్ప ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా బొగ్గుల దస్తగిరి మాట్లా డుతూ 2024 ఎన్నికలలో కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గిరిజోన్, టీడీపీ నాయకులు అమర్, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, జెక్రయ్య, బాలాజి వెంకటేశ్, తిమ్మన దొడ్డి సర్పంచ్ నాగలక్ష్మి, నూరి పాల్గొన్నారు.

రమణీయం.. యాగంటీశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఓర్వకల్లు, మార్చి 20: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున యాగంటీశ్వరుడి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగిస్తూ మేళతాళాలు, నందికోల సేవ బాణసంచాల నడుమ రథం మీదకు చేర్చారు. స్వాముల వారికి అర్చకులు ఉరుకుందయ్య ప్రత్యేక పూజలు జరి పారు. రథాన్ని ఆలయం ముందు నుంచి గ్రామం వరకు లాగి యథా స్థానంలో నిలిపారు. అనంతరం భక్తులు రథానికి, స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. వీటిని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుకేశన్న, ఈవో మద్దిలేటి, మాజీ చైర్మన్ మద్దయ్య, సీఐ చల్లని దొర, నాయకులు చంద్రశేఖరప్ప, మల్లికార్జునప్ప, శ్రీనివాసులు, మధుసూదన్‌గౌడు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రాజా రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అలరించిన సినీ సంగీత విభావరి: యాగంటీశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా సినీ సంగీత విభావరిని బుధవారం ప్రారంభమైంది. హైదరా బాదు సినీ జానపద కళాస్రవంతి వారిచే సినీ సంగీత విభావరి నిర్వహిం చారు. రేలారేలారేలా గోపాల్, లావణ్య, యాంకర్ లక్ష్మి, వినోద్, కిషోర్, విజయ, సూరిలు పాడిన జానపద గీతాలు, సినీ సంగీత విభావరి పాట లు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ మధుకేశన్న, ఈవో మద్దిలేటి, మాజీ చైర్మన్ మద్దయ్య, సీఐ చల్లనిదొర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్టాంటన్‌పురంలో సమస్యలు పరిష్కరించాలి



మురుగు కాలువలను పరిశీలిస్తున్న పుల్లారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 20: స్టాంటాన్‌పురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కమిటీ సభ్యులు స్టాంటాన్‌పురంలో పర్యటించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ స్టాం టాన్‌పురంలో మురుగునీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. బాగున్న కాలువలు పగులకొట్టి కొత్త కాలువలు నిర్మిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్న అధికారులు దళిత కాలనీలో మురుగు కాలువలు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సభ్యులు సర్వేశ్వర్‌రెడ్డి, కాడప్ప, సుదర్శనము, ఆర్.రాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ నాయకురాలు బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, మార్చి 20: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ నాయకురాలు బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో టీడీపీలో చేరిన తొలిసారిగా బైరెడ్డి శబరి ఉయ్యాలవాడ గ్రామానికి వచ్చారు. ఆ గ్రామ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు గ్రామంలోని ఆలయాల్లో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి శబరి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్ రెడ్డికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపుదామని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభు త్వంలో భూకబ్జాలు ఎక్కువయ్యాయని అన్నారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వేసిన రోడ్లు ఇప్పటికీ చెక్కుచెదరలే దన్నారు. ఉద్యోగాలు లేక యువత ఖాళీగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు రాంభూపాల్ చౌదరి, రమణారెడ్డి, మధుమోహన్ రెడ్డి, సురేష్ రెడ్డి, వేణు గోపాల్, ఆనందరావు, నారాయణ, ధనుంజ యరెడ్డి, మణిరెడ్డి, భరత్, మాదన్న పాల్గొన్నారు.

తరావీహ్ నమాజులో ఖురాన్ పఠనం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 20: రంజాన్ మాసాన్ని పురస్క రించుకుని ఆషరా అంటే గురువారం నుంచి పదిరోజులు పాటు తరా వీహ్ ప్రార్థనలో ఖురా న్ పఠనం ఉంటుందని జమియత్‌ఉలమా జిల్లా అధ్యక్షుడు మౌలానా డా.ఖాజ అబ్దుల్ మజీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఖురాన్‌లోని మూడు పారా పఠనం చేస్తారని అన్నారు. ఇషా నమాజు రాత్రి 8.30 ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9032875378కు సంప్రదించాలని సూచించారు.

'దేవాలయ అక్రమాలపై దృష్టి సారించాలి'



సమావేశంలో పాల్గొన్న బజరంగ్ దళ్ నాయకులు

కర్నూలు(కల్చరల్), మార్చి 20: బళ్లారి చౌరస్తాలోని ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగే అక్రమాలపై దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు దృష్టి సారించాలని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆలయ ఆవరణలో హనుమాన్ టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు, ధర్మకర్త సంపతి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రతాపరెడ్డి మాట్లాడుతూ బళ్లారి చౌరస్తాలోని అంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేశామ న్నారు. కానీ గత కొన్నేళ్లుగా ఆలయ ధర్మకర్తలు, స్థల దాతలు, ధార్మిక, సామాజిక, ఆధ్యాత్మిక వ్యక్తులతో పాలక మండలిని ఏర్పాటు చేయ కుండా నిర్లక్ష్యం వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. సమా వేశంలో ఈశ్వరయ్య, మాధవరాయుడు, శ్యాంసుందర్ గౌడ్, రాజగౌడ్, భరత్ సింహారెడ్డి, తిమ్మారెడ్డి, కృష్ణంరాజు, రాజేశ్, మహేష్ పాల్గొన్నారు.

సచివాలయాలు ఖాళీ

ఎన్నికల విధుల్లో ఉద్యోగులు



128వ సచివాలయంలో ఉద్యోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 20: నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో ఉన్న సచివాలయాలు 90 శాతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎన్ని కల విధులకు ఉద్యోగులను ఉపయోగించుకుంటున్నారు. దీంతో ప్రధానంగా వెల్ఫేర్, ప్లానింగ్, ఎడ్యుకేషన్, వీఆర్‌ఓలను ఎన్నికల విధుల్లో వినియోగిం చుకుంటున్నారు. కొందరు కార్పొరేషన్ కార్యాలయంలో, మరి కొందరు కలెక్టరే ట్, ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి సచివాలయంలో అడ్మిన్, వెల్ఫేర్, వీఆర్‌ఓ, ఎడ్యుకేషన్, ఏఎన్ఎం, అమ్యూనిటి, శానిటేషన్, విమెన్ ప్రొటెక్షన్, ప్లానింగ్, ఎనర్జిటిక్ సెక్రటరీలు విధులు నిర్వహించాలి. ప్రస్తుతం సచివాలయంలో ఒకరో ఇద్దరు మాత్రమే ఉంటున్నా రు. మిగిలిన అందరూ ఎన్నికల విధుల్లో ఉన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 137 సచివాలయాలు ఉన్నాయి.

● ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన

సచివాలయ ఉద్యోగులను ఎన్నికల విధుల్లో ఉపయోగించరాదని ఎన్నికల కమిషన్ చెప్పిన కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో ఓటర్ల తొలగింపు కార్యక్రమం కోసం సచివాలయ ఉద్యోగులను నియమించారు. వీరంతా మొన్నటి వరకు అధికార పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, ఎమ్మెల్యేలు చెప్పిన మాటలు విన్నారు. ప్రస్తుత కూడ కొందరు ఉద్యోగులు అధికార పార్టీ నాయకులు మాటలు వింటూ టీడీపీ ఇతర పార్టీలకు సంబంధించి ఓటర్ల జాబితాలను తొలగి స్తున్నారన్న అనుమానాలు వస్తున్నాయి.

గొడవలకు పాల్పడితే చర్యలు: ఎస్‌ఐ



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ బాలనరసింహులు

కోడుమూరు(రూరల్), మార్చి 20: గ్రామాలలో గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ బాలనరసింహులు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం వర్కూరులో ప్రజలతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ప్రశాం తంగా జరుపుకోవాలన్నారు. నిందితుల ప్రవర్తనపై పోలీసుల నిఘా ఉంటుందని, ప్రజలు ఓటును నిర్భయంగా వేసుకోవాలని అన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేసినా, భయపెట్టాలని చూస్తే 100కు డయల్ చేయాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ



మురళీకృష్ణను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వైఎస్ షర్మిల

కర్నూలు(రూరల్), మార్చి20: కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు పరిగెల మురళీకృష్ణ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ కండువా కప్పి మురళీకృష్ణను పార్టీలోకి ఆహ్వానించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డి మురళీకి మళ్లీ టికెట్ ఇవ్వకుండా డాక్టర్ ఆదిమూలపు సతీష్‌కు కేటాయించారు. దీంతో మురళీకృష్ణ వైసీపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు పసుపుల ప్రతాప్, తొలిశాపురం ఎల్లారెడ్డి, వెంకాయపల్లె శివ కాంగ్రెస్‌లో చేరారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు, మార్చి 20: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో యాగంటీశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు బుధవారంతో ముగి శాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా గుంటూరు జిల్లా కొండబాల వారిపాలెం గ్రామానికి చెందిన రైతు జీపీ చౌదరి బుల్స్ ఎద్దులు 5,577 అడుగుల దూరం లాగి రూ.50వేల నగదును గెలుపొందాయి. రెండో విజే తగా కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్‌గౌడు ఎద్దులు 4,500 అడుగుల దూరం లాగి రూ.40వేల నగదును గెలుపొం దాయి. మూడో విజేతగా గుంటూరు జిల్లా మూ సాని చంద్రశేఖర్ రెడ్డి ఎద్దులు 4,742 అడుగుల దూరం లాగి రూ.30వేల నగదు ను కైవసం చేసుకున్నాయి. నాలుగో విజేతగా గుంటూరు జిల్లా కొండపాటూరు గ్రామానికి చెందిన కాకా బుల్స్ ఎద్దులు 4,623 అడుగుల దూరం లాగి రూ.20వేల నగదును గెలుపొందాయి. ఐదో విజేతగా వెల్దుర్తి మండలం కలుగోట్ల గ్రామానికి చెందిన రమేష్‌నాయుడు ఎద్దులు 4,500 అడుగుల దూరం లాగి రూ.15వేల నగదును గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతలు నగదును అందజేశారు. పోటీల వ్యాఖ్యాతగా వాడాల రామానాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధు కేశన్న, రైతు సంఘం నాయ కులు చంద్రశేఖరప్ప, మల్లికార్జునప్ప, శ్రీనివా సులు, మదుసూదన్‌గౌడు, రాము పాల్గొన్నారు.

అనస్థీషియా పరికరాల విరాళం



ఎంవోయు పత్రాలను అందజేస్తున్న పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ చౌవన్

కర్నూలు(హాస్పిటల్), మార్చి 20: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రూ.18.75 లక్షల విలువైన మూడు అనస్థీషియా వర్క్‌స్టేషన్ పరికరాలను విరాళంగా అందించింది. బుధవా రం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డికి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ చౌవన్, విక్రమ్ పరికరాలను అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ముందుకు రావడం అభినందనీయమ న్నారు. ఆసుపత్రిలో పవర్‌గ్రిడ్ నిబంధనల ప్రకారం టెండర్స్‌కు వెళ్లారనీ, ఆసుప త్రి నుంచి ఎంవోయు పరికరాలను అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగా యన్నారు. అనంతరం పవర్‌గ్రిడ్ సౌజన్యంతో మూడు వర్క్‌స్టేషన్లు విరాళంగా అందించారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, అనస్థీషియా ప్రొఫెసర్ కొండారెడ్డి, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి సభను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 20: ఈనెల 23న జరిగే భగత్ సింగ్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కే.ప్రభాక ర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ అధ్యక్షతన సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ వర్ధంతి సభలను వాడవాడలా జరిపి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు కే.జగన్నాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్.రాధాక్రిష్ణ, అంజిబాబు పాల్గొన్నారు.

● భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిలను అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించాలని ఏఐవైఎఫ్‌జిల్లా కార్యదర్శి కారుమంచి అన్నారు. సీఆర్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో బీసన్న, రాజీవ్, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 20: మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు బి.జగన్ (మాంటిస్సోరి పాఠశాల), ఎం.కృతిక (కేశవరెడ్డి పాఠశాల, వెంకటరమణ కాలనీ)లు ఎంపికయ్యారు. అనంతపురం ఆర్‌డీటీలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో క్రీడానైపుణ్యాలను కనబరిచిన ఫలితంగా జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎస్.జాకీర్ హుశేన్, కార్యదర్శి కే.విజయకుమార్ తెలిపారు. స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో డీఎస్‌డీవో బి.భూ పతి హాజరై క్రీడాకారులను అభినందించారు. జిల్లా కార్యదర్శి కె.విజయకుమార్, కోశాధికారి అయ్యన్నగౌడు, జాయింట్ సెక్రటరీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు అభినందన

కర్నూలు(హాస్పిటల్), మార్చి 20: కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్‌కు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (కర్నూలు జీజీహెచ్) అభినందనలు తెలిపింది. యూనియన్ అధ్యక్షుడు బాలు నాయక్, ఆసుపత్రి సర్జంట్ శ్రీనివాసులు, అసిస్టెంట్ సర్జంట్ ఉరుకుందయ్య, యూనియన్ నాయకులు డీఎంహెచ్‌వోకు బొకే అందించి అభినందనలు తెలి పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శేషిరెడిద్ద, రంజిత్, రమేష్, నూర్ అహ్మద్, మనోహర్, రాజు పాల్గొన్నారు.

ఉత్తమ నాయకుడిని ఎన్నుకోవాలి

సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఫిస్టా 2కే 24లో టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 20: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ నాయకుడిని ఎన్నుకోవాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగర శివారులోని నంది కొట్కూరు రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో వారం రోజుల పాటు జరుగుతున్న ఫిస్టా 2కే 24 కార్యక్రమానికి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకుని జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం చాలా కష్టమైందన్నారు. విద్యార్థులు కేవలం చదువు లోనే కాకుండా అన్ని రంగాలపై పట్టు సాధించాలని సూచించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో పెట్టుబ డులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతారన్నారు.

ఘనంగా మారెమ్మవ్వ దేవర

పత్తికొండ టౌన్, మార్చి 20: పట్టణంలో బుడగజంగాల కాలనీలోని గద్దెరాళ్ల మారెమ్మవ్వ దేవర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం తెల్లవార ఝామున అమ్మవారికి బుడగజంగాల వాసులు దున్నపోతును బలి ఇచ్చి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం బుడగజంగాల కుటుంబాలు ఒక్కొక్కరుగా బోనాలుతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా దేవర ఉత్సవాలకు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, పోచంరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపకులు మురళీధర్ రెడ్డి అమ్మవారి సన్నిధిలో వేర్వేరు సమయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బుడగజంగాల పెద్దలు కంగనాతి, సుంకన్న, రామన్న, హుశేనీ తదితరులు పాల్గొన్నారు.

'డీలర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకండి'

మద్దికెర, మార్చి 20: మండలంలోని చౌకదుకాణ డీలర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణ డీలర్లతో పాటు ఎండీయూ వాహనదారులు కూడా ఎన్నికల్లో పాల్గొనకూడదని అన్నారు. ఎండీయూ వాహనాలపై ఉన్న సీఎం జగన్ ఫొటోలకు ముసుగు వేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌ను తప్పకుండా పాటించాలన్నారు. డీలర్లు ప్రజలకు బియ్యం అందించాలే తప్ప.. రాజకీయాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేయకూడదని హెచ్చరించారు. చౌకదుకాణాలు గల డీలర్లు తెల్లరేషన్‌కార్డు గల ప్రతి ఒక్కరికి సక్రమంగా బియ్యం అందించాలన్నారు. ఎన్నికల కమిషన్ అమలు చేసిన విధి విధానాలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనలు అమలు చేయకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆర్ఐ రవికుమార్, చౌకదుకాణాల డీలర్లు సుంకు రవి, లక్ష్మీనారాయణ, గౌస్, నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే!



దేవనకొండ బస్టాండ్ అవరణలో ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ గుంత

దేవనకొండ ,మార్చి 20: నిత్యం వాహనాలు ప్రజలు తిరిగే దేవనకొండ బస్టాండ్ ఆవరణలో డ్రైనేజీ ప్రమాదకరంగా ఉంది. కాలువలో పూడిక చేరినప్పుడు తీసేందుకు మ్యాన్‌హోల్ ప్రధాన రహదారి పక్కనే ఉంది. డ్రైనేజీ హోల్ మూసివేయనందునా అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు గుంతని చుసి భయపడుతున్నారు. ప్రజలు నిత్యం రద్దీగా తిరిగే ప్రాంతంలోనే ప్రమాదం పొంచి ఉంది. ఆదమరచి కాలువలో పడితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సేవతోనే గుర్తింపు

దేవనకొండ, మార్చి 20 : ప్రజలకి సేవ చేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని మండల వైద్యాధికారి విజయభాస్కర్ అన్నారు. స్థానిక వైద్యశాలలో సూపర్‌వైజరుగా పని చేస్తున్న పద్మావతి పదవీ విరమణ సందర్భంగా బుధవారం తోటి ఉద్యోగులు సన్మానించారు. పద్మావతి చేసిన సేవలని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు రఘురామిరెడ్డి, కళ్యాణ్, అతవుల్లా ,సిబ్బంది అరుణజ్యోతి, ఈశ్వరయ్య, సాయిబాబా, రంగస్వామి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, మార్చి 20 : మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన మూర్తి అనే భక్తుడు రూ.లక్ష విద్యాదానంకు విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. బుధవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ వద్ద లారీ బోల్తా

● ఇద్దరికి గాయాలు



అదుపు తప్పి పొలంలో బోల్తా పడిన లారీ

మంత్రాలయం, మార్చి 20: మంత్రాలయం మండలంలోని మాధవరం స్టీల్ ఫ్యాక్టరీ (మారుతి ఇస్పాత్ లిమిటెడ్) ఫ్యాక్టరీ నుంచి పైపు లోడుతో హైదరాబాదుకు వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఈ ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం బుధవారం జరిగింది. ఫ్యాక్టరీలో పైపులతో లోడుతో హైదరాబాదుకు వెళ్తుండగా.. అదుపు తప్పి పోలంలోకి దూసుకెళ్లడంతో బోల్తా పడింది. లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్‌ను, క్లీనర్‌ను చికిత్స నిమ్మితం ఆసుపత్రికి తరలించారు.

'కోడ్' కలవరం





చిక్కీలపై ఉన్న జగనన్న ఫొటో, జగన్ ముఖచిత్రంతో ముద్రించిన సంచులు

● అధికారులకు తలనొప్పి తెచ్చిన జగన్ ప్రచార ఆర్భాటం

● విద్యార్థులకు చిక్కీల పంపిణీపై సందిగ్ధత

ఆదోని, మార్చి 20 : ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అధికారులకు కత్తి మీద సాములా మారింది. సాధారణంగా నేతల విగ్రహాలకు ముసుగు వేయడం, కార్యక్రమాల్లో నాయకుల ఫొటోలు తొలగించడం, శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలు కనిపించకుండా చేయడం, బ్యానర్లు తొలగించడం వంటి పనులతో సతమతమవుతున్నారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రచార ఆర్భాటం కోసం చేసిన పనులు ప్రస్తుతం వారిని ఆందోళనకు గురి చేస్తున్నాయి.

పాఠశాలలో విద్యార్థులకు ఇచ్చే చిక్కీల కవర్లు, ఇతర ఉపకరణాల అన్నింటిపై ముఖ్యమంత్రి జగన్ పేరు, ఫొటోలు ఉన్నాయి. వాటి విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నియమావళి అమలులో భాగంగా గడువులోపు అన్నింటినీ తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా సిబ్బంది పూర్తిస్థాయిలో ఆయా పనులు చేసినా, ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల పై తర్జన, భర్జన పడుతున్నారు.

● ఇదీ పరిస్థితి....

ఎన్నికల వేళ ప్రతి అంశంపై రాజకీయ నాయకులు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం సాధారణం. ఈ నేపథ్యంలో సున్నితమైన అంశాల పై స్పష్టమైన ఆదేశాలు ఇస్తేనే క్షేత్రస్థాయిలో సమస్య ఉండదని ఆయా శాఖల సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

ఇంటి గోడలు, ప్రహరీలకు మా నమ్మకం నువ్వే జగన్ అని ఆయన ముఖచిత్రంతో ముద్రించి ఉన్న స్టిక్కర్లను అతికించారు. ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల చిత్రాలు, బ్యానర్లు ఇతర ప్రచార అంశాలకు సంబంధించి తొలగించడం లేదా సంబంధిత యజమానుల అనుమతి పత్రాలు తీసుకోవడం తప్పనిసరి. ఇప్పటివరకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే వాటిని ఏర్పాటు చేశారు. ఈ విషయం పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

పట్టణాల పరిధిలో వార్డు సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద బ్యానర్లు, ఇతర ప్రచార సామగ్రి తొలగింపు, ఫొటోలు కనిపించకుండా కాగితాలు అతికించారు. గ్రామాల్లో ఆయా పనులు పూర్తిస్థాయిలో చేయాల్సి ఉంది.

● చిక్కీల పై జగన్ ఫొటో.....

పాఠశాలలో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద కింద అందించే చిక్కీ ప్యాకెట్ల పై ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉండటంతో నిబంధనల ప్రకారం కవర్లు తొలగించాలి. ఈ విషయంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు రావాల్సి ఉందని అధికారుల చెబుతున్నారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే ప్యాకెట్ రూపంలో కాకుండా, కవర్ తొలగించి చిక్కీలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. జగనన్న గోరుముద్ద పేరిట వచ్చిన ప్యాకెట్లు పాఠశాలల్లో, హాస్టల్లో వేలసంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈవో



విలేకరులతో మాట్లాడుతున్న డీఈవో శ్యామూల్

హొళగుంద, మార్చి 20 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ తనిఖీ చేశారు. మూడు సెంటర్లు ఏ,బీ,సీ గాను 554 మంది విద్యార్థులకు గాను 524 మంది పరీక్షలు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ చెక్క బెంచులలో ఒక్కోవిద్యార్థిని మాత్రమే కూర్చోబెడుతున్నామని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు.

ఆలూరు, మార్చి 20 : ఆలూరు మోడల్ స్కూల్లో జరుగుతున్న పది పరీక్ష కేంద్రాన్ని డీఈఓ కే శ్యామ్యూల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట ఎంఈవో కోమలాదేవి, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ పాల్గొన్నారు.

'నీ ఓటు.. నీ భవిష్యత్తు'



మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రరెడ్డి

ఆదోని టౌన్, మార్చి 20 : గత ఎన్నికల్లో 50 శాతం కన్నా తక్కువ పోలింగ్ జరిగిన ప్రాంతాలలోని ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు మెప్మా ఆధ్వర్యంలో "నీ ఓటు, నీ భవిష్యత్తు" కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక చిన్న శక్తి గుడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు గత ఎన్నికలలో 50 శాతం కన్నా తక్కువ పోలింగ్ జరిగిన ప్రాంతాల్లోని మీ ఓటు హక్కు మీ భవిష్యత్తుకు పునాది లాంటిదని, మీకు నచ్చిన, మీరు మెచ్చిన నాయకుడినే ఎన్నుకునే అవకాశం కల్పించే ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. 18 ఏళ్ల నిండి, ఓటు హక్కు లేని వారు ఎప్రిల్ 15లోగా ఓటర్ కార్డు పొందే అవకాశం ఉందన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతల గురించి స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అనుపమ, మెప్మా అధికారులు షమీమ్ బాను, వీరారెడ్డి, సీఈవోలు అరుణ, కృష్ణవేణి, నారాయణమ్మ, జావేద్ పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

● 200 మంది అనుచరులతో వైసీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు టీడీపీలో చేరిక

● పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే బీవీ



టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకురాలు అన్నపూర్ణమ్మ, ఆమె కుమారుడు, అనుచరులు

ఎమ్మిగనూరు, 20: వైసీపీ ఎమ్మిగనూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు, 31వ వార్డు మాజీ కౌన్సిలర్ అన్నపూర్ణమ్మ, ఆమె తనయుడు, అనుచరులు మూకుమ్మడిగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. టీబీపీ కాలనీలోని బీవీ నివాసం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్నపూర్ణమ్మ తనయుడు గోవిందు, అనుచరులు గోపి, గోపాల్, స్వామీ, కృష్ణ, దశరథ్, మల్లేష్, లింగప్ప, రాజు, రమేష్, శ్రీనివాసులు, వీరేంద్రలతో పాటు 200మందితో కలిసి ర్యాలీగా వచ్చి టీడీపీలో చేరారు. వీరికి జయనాగేశ్వరరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ వైసీపీలో కష్టపడి పనిచేసే వారికి స్థానం, గుర్తింపు లేదన్నారు. మహిళలు అంటే చిన్నచూపు చూడటమే గాక అవహేళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బీవీ జయనాగేశ్వరరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా బుట్టా రేణుక పోటీ చేస్తున్న సమయంలో వైసీపీ చెందిన పట్టణ మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ పార్టీని వీడి టీడీపీలో చేరటం ఆపార్టీకి షాక్ ఇచ్చినట్లయ్యిందని విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

5వ వార్డులో విస్తృత ప్రచారం

పట్టణంలోని 5వ వార్డులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, కౌన్సిలర్లు రామదాసు గౌడ్, దయాసాగర్, నాయకులు కొండయ్య చౌదరి, చేనేత మల్లి, సుందరరాజు,రామకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ దేవరలో బీవీ పూజలు

నందవరం : మండలంలోని హలహర్వి, కనకవీడు గ్రామాల్లో జరుగుతున్న మారెమ్మ దేవర ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రైస్‌మిల్ నారాయణరెడ్డి, కాశీంవలీ, దర్మాపురం గోపాల్, రూప జగదీష్, జగ్గాపురం నరసింహులు, నాగరాజుగౌడు,గట్టాల రంగన్న, శ్రీను, గజేంద్రరెడ్డి, శేఖర్, దావీదు, వెంకట్రాముడు, కనకవీడు డబ్బాఈరన్న, రాజు, సోమప్పనగర్ రఘు పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు

హొళగుంద, మార్చి 20 : మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన హొళగుంద, కోగిలితోట, ఎల్లార్తి గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించినట్లు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిననాటి నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు జరకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టంగా తెలియజేసిందని పేర్కొన్నారు. ఎవరైనా ఘర్షణలకు ప్పాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పెద్దయ్య నాయుడు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరామ్ నాయక్, కానిస్టేబుల్ గురుప్రసాద్, రామాంజిని రెడ్డి, పెద్దన్న, వెంకటేష్, జనార్దన్, రాజగోపాల్, వెంకటేశ్వర్లు, చంద్ర, శేక్షావలి పాల్గొన్నారు.

కార్యకర్తలు ధైర్యంగా ఉండండి : తిక్కారెడ్డి

మంత్రాలయం, మార్చి 20: టీడీపీ టికెట్ రెండో జాబితాలో ప్రకటించిన వారిపై పునఃవిచారణ ప్రారంభమైందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో బూదూరు, వగరూరు, కల్లుదేవకుంట, పెద్దకడుబూరు మండలంలోని మురవని, జాలవాడి, కంబలదిన్నె, కోసిగి మండలంలోని సాతనూరు, కందుకూరు గ్రామాల టీడీపీ మండల కమిటీలు నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ రెండో జాబితాను ప్రకటించి వారం రోజులు కావడంతో ప్రకటించిన అభ్యర్థిపై రోజువారి నివేదికలను అధిష్ఠానం పరిశీలిస్తుందని అన్నారు. కార్యకర్తలు, నాయకులెవరూ అధైర్యపడవద్దని, సంయమనం పాటించాలని కోరారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, బూదూరు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డి, అశోక్ రెడ్డి, విజయరామిరెడ్డి, ఎంపీటీసీ మేకల వెంకటేశ్ పాల్గొన్నారు.

వైభవంగా బసవేశ్వరుని రథోత్సవం



ప్రజల మధ్య ఊరేగుతున్న బసవేశ్వరస్వామి రథోత్సవం

కోసిగి, మార్చి 20: బసవేశ్వరుని రథోత్సవం బుధవారం కన్నుల పండువగా సాగింది. జంపాపురం గ్రామంలో వెలసిన బసవేశ్వరస్వామికి బుధవారం ఉదయం నుంచి బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూలంకరణలో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి రథోత్సవం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. అంతకుముందు ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, జ్ఞానేష్, అయ్యన్న తదితరులు బసవేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం రాఘవేంద్రరెడ్డి, నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, నరసారెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ డిపోలో విజిలెన్స్ దాడులు

ఎమ్మిగనూరు, మార్చి, 20: కలుగొట్ల గ్రామ సమీపంలో ఉన్న అమరావతి ఆయల్ డిపోలో బుధవారం రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ ఎస్పీ పూజిత ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. అమరావతి ఆయల్ డిపోలో వంట నూనే పాకింగ్‌పై తయారీ తేదీ, ఎక్స్‌పైర్ డేట్ లేకుండా తయారు చేస్తున్నారన్నారు. అలాగే నాణ్యతప్రమాణాలను పరిశీలించాల్సి ఉందన్నారు. అక్రమంగా తేదీలు లేకుండా ప్యాకింగ్ చేయటంతో రూ. 3లక్షల విలువ చేసే వంటనూనెను, అలాగే రూ.3లక్షలు విలువ చేసే ప్యాకింగ్ లేబుల్స్, సామాగ్రిని సీజ్ చేశామని అన్నారు. వంటనూనె ను ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించి పరిశీలిస్తామని అన్నారు. అటు తరువాత కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని, సీజ్ చేసిన వాటని వీఆర్వోకు అప్పగిస్తామని పేర్కొన్నారు. దాడుల్లో ఏఎఓ రూపస్, వీఆర్వో సుధారాణి పాల్గొన్నారు.

టీడీపీలోనే వాల్మీకులకు పెద్దపీట : వాల్మీకి యూత్

● రాఘవేంద్రరెడ్డిని గెలిపించుకుంటాం



రాఘవేంద్రరెడ్డికి సీటు కేటాయించడంతో హర్షం వ్యక్తం చేస్తున్న వాల్మీకులు

కోసిగి, మార్చి 20: తెలుగుదేశం పార్టీలోనే వాల్మీకులకు చంద్రబాబు నాయుడు సముచిత స్థానం కల్పించారని కోసిగి మండల వాల్మీకి యూత్ సభ్యులు అరివిలి వీరేష్, హోటల్ ఈరేష్, పెర్లి హనుమేష్, పోతుల మధు, పోతుల ఈరారెడ్డి, పైఇంటి భీమేష్ అన్నారు. బుధవారం కోసిగిలో వాల్మీకి సర్కిల్‌లోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో 80 శాతం పైగా వాల్మీకులు, బీసీలే ఓటర్లుగా ఉన్నారన్నారు. టీడీపీ టికెట్ వాల్మీకులకు కేటాయించడంతో టీడీపీ అధినేత చంద్రబాబుకు, నారా లోకేశ్, జనసేనాని పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి యూత్ సభ్యులు మల్లికార్జున, మాంతయ్య, ఉప్పలపాటి అర్జున్, రామిరెడ్డి, తిక్కారెడ్డి, మాదేవ, సురేష్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మీనాక్షినాయుడికి టికెట్ రావాలని పూజలు

ఆదోని, మార్చి 20 : మీనాక్షినాయుడికి అసెంబ్లీ టికెట్ రావాలని కోరుతూ బైచిగేరి అంబాభవాని దేవాలయంలో భవాని మాతకు టీడీపీ నాయకులు బుధవారం పూజలు చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎనలేని సేవలు అందించి, ఆదోని అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ, టీడీపీ నాయకులను, కార్యకర్తలను తన కుటుంబంలా చూస్తున్న మీనాక్షి నాయుడుకు అధిష్ఠానం అసెంబ్లీ టికెట్ కేటాయించాలని కోరారు. నాయకులు హనుమన్ సింగ్, మాజీ ఎంపీటీసీ తెలుగు నాగేంద్ర, భగవాన్ సింగ్, బోయ బాలు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా విజేతగా పంజాబ్ జట్టు

● ముగిసిన ఆల్ ఇండియా సెపక్ తక్రా పోటీలు



ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లతో నిర్వాహకులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 20 : ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడామైదానంలో నాలుగు రోజుల పాటు జరిగిన ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్‌తక్రా క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. దేశంలోని 40 యూనివర్సిటీల నుంచి క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ, ఆదోని ఆర్ట్స్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలలో ఫైనల్ విజేతగా పంజాబ్ యూనివర్సిటీ ఆఫ్ పటియాల జట్టు నిలువగా, రన్నర్ జట్టుగా కాలికట్ యూనివర్సిటీ, తృతీయ స్థానంలో చెన్నై అన్నా యూనివర్సిటీ మణిపూర్ విశ్వవిద్యాలయలు నిలిచాయి. విజేతులైన జట్టులకు కర్నూలు సెయింట్ జోసెఫ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ శౌరిల్ రెడ్డి, జ్యోతిర్మయి కళాశాల కరస్పాండెంట్ మురళి బాబు, ఆర్‌యూ రెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ట్రోఫీ, సర్టిఫికెట్లను, ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఇండియా సెపక్ తక్రా పోటీలను మొట్టమొదటిసారిగా ఆదోనిలో నిర్వహించి విజయవంతం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గుట్ట సతీష్, వైస్ చైర్మన్ డాక్టర్ విజయలక్ష్మి, కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి ప్రిన్సిపాల్ మురళీమోహన్, మాజీ కరస్పాండెంట్ విశ్వనాథ్ రెడ్డి, సనత్‌కుమార్, సత్యనారాయణ, సుగురప్ప, బసవన్న గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఫిజికల్ డైరెక్టర్లు ఎర్రిస్వామి, కమ్మిరెడ్డి, ఆర్‌యూ ఫిజికల్ డైరెక్టర్లు శివకిషోర్, మత్తయ్య, కళ్యాణ్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద, మార్చి 20 : హొళగుందం మండల పరిధిలోని నేరణికి తండాకు చెందిన టాక్రా నాయక్, పరమేష్ నాయక్, దుగ్యానాయక్ అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్సై పెద్దయ్య నాయుడు బుధువారం తెలిపారు. మంగళవారం రాత్రి 8 బాక్స్‌లో కర్ణాటక మద్యం 90 ఎంఎల్ 768 టెట్రా ప్యాకెట్లను రెండు ద్విచక్ర వాహనాలపై తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కోసిగి : అక్రమంగా కర్ణాటక నుంచి తరలిస్తున్న పది బాక్సుల కర్ణాటక మద్యం 960 డిప్స్ ఆఫ్ ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దుర్గప్పను అరెస్టు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ రమేష్‌బాబులు తెలిపారు.

సేవకు కర్ణాటకలో సత్కారం

ఆదోని రూరల్, మార్చి 20 : పెద్దహరివాణానికి చెందిన విజయ కుమార్, పెద్దతుంబళం పీహెచ్‌సీకి చెందిన తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనానికి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో ఆయన సేవలను గుర్తించిన కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా శిరుగుప్పకు చెందిన కన్నడ సాంస్కృతిక విభాగానికి చెందిన మహాదేవ , శివకుమార్ ఆధ్వర్యంలో విజయ్‌ను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

నేటినుంచి ఉరుసు మహోత్సవాలు

దేవనకొండ, మార్చి 20: మండల కేంద్రంలో నేటినుంచి మూగితాత ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం గంధం ,శుక్రవారం ఉరుసు ,శనివారం జియారత్ నిర్వహించనున్నట్లు దర్గా కమిటిసభ్యులు తెలిపారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

మద్దికెర, మార్చి 20: స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో జరుగుతున్న పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. బుధవారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపటి నుంచి ఇమామ్‌సాబ్ ఉరుసు

మద్దికెర, మార్చి 20: గ్రామ శివారు మల్లప్పగేటు సమీపాన కులమతాలకు అతీతంగా వెలసిన 322వ హజరత్ ఇమామ్‌సాబ్ వలి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22న ఇమామ్‌సాబ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గంధం, మెరవణి ఉంటుందని, 23న శనివారం రాత్రి శంపీర్ ఉత్సవాలు జరుగతాయని పేర్కొన్నారు.